21

మనసులోని చీకటి

ఆది హైదరాబాదు మహానగరం. ఆకాశాన్నంటే స్కై స్క్రేపర్సు ఆ నగరంలో ఉన్నాయి. ఎత్తయిన తాటిచెట్ల పక్కన పెరిగిన మూరెడెత్తు వెంపలి చెట్లులా స్కై స్క్రేపర్సు పక్కనే చిన్న చిన్న డాబా ఇళ్ళు ఉన్నాయి. జిరాఫీ ఒంటిమీద చారల్లా చక్కగా సాగిఉన్న రోడ్లు వాటిని కలుపుతూ సిలువ గుర్తుల్లా అడ్డ రోడ్లు ఉన్నాయి. ఈగల్లా రొదచేసే మోటారు వాహనాలు ఆ సిటీలో తిరుగుతుంటాయి. గద్దల్లా ఎగిరే విమానాలుకూడా ఉన్నాయి. నిమిషం తీరికలేక తిరిగే వ్యాపారస్తులు, ఉద్యోగస్తులు, క్షణం గడచే దెలాగ అని ఆలోచించే నిరుద్యోగులూ ఉన్నారు. అందుకే అన్నారు నగర జీవనం నలసల మరిగే వేడినీటి లాంటి దని, పల్లెటూరు జీవనం కొత్తకుండలో చల్లని నీరని.

ప్రవాహంలో కొట్టుకుపోయే మహావృక్షాలు, సుగంధ ద్రవ్యాలు, మురికి దిబ్బలు, చెత్తా చెదారంలా నగరంలో వ్యాపారస్తులు, ఉద్యోగస్తులు, గౌరవనీయులు, దొంగలు, హంతకులు, దోపీడీదార్లతో కలిసి కలగా పులగంగా ఉంటుంది జన ప్రవాహం. అందుకే ఎక్కడో మారుమూల పల్లెటూళ్ళలో దొంగతనాలు, హత్యలు, మానభంగాలు చేసిన దుర్మార్గులు నగరాలకు వచ్చి జన ప్రవాహంలో కలిసి పోతూంటారు. ఇక్కడ ఎవరు ఎవరో గుర్తించడం కష్టం. పెద్దమనిషి అనుకున్న వాడిని కదిలించి చూస్తే వాడు పదిమందిని చంపిన వాడయి ఉంటాడు. అలాగే నీ దృష్టిలో చెడ్డవాడుగా కనిపించినవాడు పది కాపురాలు నిల బెట్టిన దానకర్ణుడయి ఉంటాడు. అందుకే నగరాల్లో ఒకర్ని ఒకరు పట్టించుకోరు. ఎవరి జీవితం వారిది.

తెలుగు విశ్వవిద్యాలయ
గ్రంథాలయం
నమోదు సంఖ్య....41286....
తేది....21.3.95....

విజయకుమార్ కోటీ సెంటరులో బస్‌స్టాప్ దగ్గర నిలబడి ఉన్నాడు అతను నగరంలోని ఒక బాంకులో ఆఫీసరుగా పనిచేస్తున్నాడు. పుట్టుకతోనే ధనవంతుడు. ఎప్పుడూ ట్రిమ్‌గా బాయిలెట్ అయి నీట్‌గా ఉంటాడు. అయితే అతనికుండే ఒకే ఒక లోపం స్త్రీ వ్యామోహం అది తీసేస్తే ఈలోకంలో అంతకంటే మంచివాడు ఉండకపోవచ్చు, అందమైన యువతి భార్యగా దొరికి, ఇద్దరు పిల్లలు పుట్టినా అతనికీ జాడ్యం పోలేదు. బాంకు పనిచేసే రోజుల్లో స్కూటరుమీద వెళ్ళి వస్తూంటాడు. సెలవయితే చాలు సిటీ బస్సులో తిరుగుతూ వీలున్నంతవరకు లేడీస్‌తో పరిచయాలు కల్పించుకునేందుకు ప్రయత్నిస్తూ ఉంటాడు. ప్రస్తుతం ఇంజనీరింగు కాలేజీలో బి ఇ. చదువుతున్న బావమరిది ఏదో ఫంక్షన్ ఉందని రమ్మనడంతో యూనివర్సిటీ కాంపస్‌కు బయలుదేరాడు.

ఇంతలో అతను ఎక్కవలసిన బస్సువచ్చి ఆగింది. విజయకుమార్ యూనివర్సిటీ కాంపస్‌కు టికెట్ కొట్టించాడు. బస్సు లాంచింగ్ పాడ్ వదిలిన రాకెట్‌లా ముందుకు దూసుకుపోయింది. విజయకుమార్ ముందు చాలామంది లేడీస్ నిలబడి ఉన్నారు. విజయకుమార్ వాళ్ళ అందాలను చూపులతో తడిమి ఆనందిస్తున్నాడు. హాంగరు పట్టుకుని నిలబడి ఉన్న అతను తన చూపులను అన్ని వైపులకు సారించాడు. తన పక్కనే సీట్లో కూర్చుని ఉన్న ఇరవైఅయిదేళ్ళ స్త్రీ మూర్తిని చూడగానే "అరె, కృష్ణవేణి. ఇది కలా, నిజమా" అనుకున్నాడు.

"హల్లో విజయ్! ఎన్నాళ్ళకు చూశాను" అంది చేయిపైకెత్తి.

"దాదాపు ఆరేళ్ళు." గొణిగాడు ఆమెనే చూస్తూ. ఆమె అందంగా ఆకాశం లోంచి పూడిపడిన దేవకన్యలా ఉంది. ఇన్ని జరిగిన తరువాత తనను పలకరిస్తుందని అతను వూహించలేదు.

"మా ఇంటికి పోదాం రండి'' అంటూ తను దిగవలసిన స్టేజి చెప్పింది. అది అతను దిగవలసిన స్టేజికి ఇంకా ముందు ఉంది.

"అలాగే, కృష్ణవేణి!'' అన్నాడు విజయకుమార్

అతని మనసు ఆనందంతో పొంగి పోయింది. కాలేజీలో తన క్లాసుమేటు కృష్ణవేణికి, ఈనాటి కృష్ణవేణికి ఏం తేడా లేదు. అయితే అనాడు జలజల పారే సెలయేరులా ఉండేది, ఈనాడు శరీరానికి నిండుదనం వచ్చి ఇంకా అందంగా ఉంది. ఎంతమంది పిల్లలో? అసలు పిల్లలున్నారో, లేరో, మొగుడ్ని వదిలేసిందా ? ఇంకా మొగుడితోటి కాపరం చేస్తూందా? ఎన్నోసందేహాలొచ్చాయి విజయకుమార్‌కి. 'అ, ఆ మసిబొగ్గు మొగుడితో ఇంకా ఏం కాపరం చేస్తుందిలే. ఎప్పుడో వదిలేసి ఉంటుంది. ఈమె అందానికి వాడి అనాకారితనానికి పొంతన ఎక్కడ,' అని తన సందేహాలకు తనే సమాధానం చెప్పుకున్నాడు.

అతని ఆలోచనలు తనకాలేజీ జీవితంలోకి వెళ్ళిపోయాయి.

డబ్బు చేతినిండా ఉండడంతో విజయకుమార్ విద్యార్థి జీవితం ఒక మధుర స్వప్నంలా జరిగి పోయింది. అతను ఒక విద్యార్థి వర్గానికి నాయకుడు. కాలేజీలో అతని పేరు వినని వారు లేరు. అతని చుట్టూ మిత్రులు ఈగల్లా ముసురుతుండేవాళ్ళు. సినిమాలు, షికార్లు, సిగరెట్లు, మందు పార్టీలతో కోలాహలంగా ఉండేది. విజయకుమార్ ఎంతో మంది అమ్మాయిల్ని తన చుట్టూ తిప్పుకుని వాళ్ళ దగ్గర సుఖాలు రుచి చూశాడు.

అయితే విజయకుమార్ దృష్టి మొదటీనుంచీ కృష్ణవేణి మీద ఉంది. ఆమె అందం అతన్ని పిచ్చెక్కించేది. ఎంతో సోషల్‌గా నవ్వుతూ మాట్లాడుతుంది. అయితే అతను అంతకంటే చొరవ తీసుకులేకున్నాడు. ఎంతోమందిని మెస్మరిజం చేసిన తన డబ్బు ఆమె నేమీ చేయలేకపోవడం అతనికి వింతగా ఉంది.

"ఒరే ఎంత బెట్టుచేసినా ప్రయత్నిస్తే నీవల్లో పడకపోదు ముందుకు పోరా, నాయనా" అనేవాళ్ళు వందిమాగధులు కాఫీ తాగి, అతని జేబులోంచి చనువుగా సిగరెట్లు లాక్కుని కాల్చుతూ.

''ఒరే హేమలత ఎంత స్ట్రిక్టుగా ఉండేది దానిబెట్టు, అది, ఏమయింది చివరకు నీచేతిలో" అంటూ విజయకుమార్‌కు ధైర్యం చెప్పేవాళ్ళు.

ఎలాగయినా ఈవిషయం ఫైనలైజు చెయ్యాలని నిర్ణయించుకున్నాడు విజయకుమార్.

ఆ రోజు లైబ్రరీ నుంచి ఒంటరిగా వస్తున్న కృష్ణవేణి అనుసరించాడు.

"కృష్ణవేణీ! క్లాసు టెస్టులో ఫస్టు మార్కులు వచ్చినందుకు కంగ్రాచ్యులేషన్స్''

"ఇవేం ఫస్టు క్లాసులు, విజయ్! పబ్లిక్ పరీక్షల్లో వస్తేగదా ప్రయోజనం."

''దానికయినా పునాది ఇదే కదా!"

"అవుననుకో, ఇంతకీ నీకెన్ని మార్కులు వచ్చాయి?"

"నే నసలు పరీక్షకు అటెండు కాందే'' నవ్వుతూ అన్నాడు విజయకుమార్.

"పాపం! తమరికి ఫ్రెండ్స్, డ్రింకు పార్టీలు, నాయకత్వాలు, కాలేజీలో హీరో వయితివి. పరీక్షలు రాసి తమ విలువయిన కాలాన్ని వేస్టుచేసుకోలేరు గదా!" ఫక్కున నవ్వింది.

ఆ నవ్వే విజయకుమార్‌ను దూర దూర తీరాలకు తీసుకుపోతుంది. ఆమె ఎంత అందంగా ఉంటుందో అంత మధురంగా నవ్వుతుంది. అంతకంటె ఆత్మీయతగాకూడా మాట్లాడుతుంది.

"నేను పరీక్షలు రాయకపోయినా కష్టపడి చదివి మంచి మార్కులు తెచ్చుకొనే వాళ్ళంటే నాకెంతో అభిమానం.''

''అబ్బ ఎంత ఉత్తములు.'' నవ్వింది.

''కృష్ణవేణీ! ఒక మాట.''

''ఏమిటి విజయ్?"

"నువ్వు చాలా అందంగా ఉంటావు"

''ఈ రోజే తెలిసిందా!"

"సారీ నువ్వు అందంగా ఉంటావని చెప్పడమే అన్యాయం. అలా ప్రత్యేకంగా చెప్పడంవల్ల ని అందాన్ని అవమానించి నట్లవుతుంది''

"ఎందుకో ఈరోజు హఠాత్తుగా కొత్తటాపిక్ ఎత్తావు."

"ఎప్పటికయినా ఎత్తాలిసిందే కదా!"

''అది కాదులే ఇంతకుముందు ఎప్పుడు మాట్లాడినా నువ్వు చూసిన సినిమాల గురించో. మీకు వచ్చే రాబడి గురించో చెప్పే వాడివి ఈరోజు కొత్తగా ఉంటే అందుకు"

"అవిషయం వదిలేయ్, కృష్ణవేణీ! ఈరోజు నీ అందం గురించి మాట్లాడానంటే నీకేదయినా అర్థమయిందా?"

"అబ్బేలేదు.'' పెదవులు చప్పరిస్తూ అంది కృష్ణవేణి.

"సరే ఇప్పుడు చెబుతున్నాను విను. నీ అందం నన్ను మత్తెక్కించింది. నేను నిన్ను ప్రేమస్తున్నాను"

పక్కనే నడుస్తున్నదల్లా అగి అతని కళ్ళల్లోకి రెప్ప లల్లారుస్తూ చూసింది, విజయకుమార్ కూడా అమె సోగ కళ్ళల్లోకి మత్తుగా చూశాడు. అమె మవునంగా నడవడం మొదలుపెట్టింది.

"కృష్ణవేణీ! నేను నిన్ను మనస్పూర్తిగా ప్రేమించాను. నీ బంగారు ఛాయ మేని రంగు, నీ విశాలమైనకళ్ళు నన్ను ఎంతగానో అకర్షించాయి. ఎంతోకాలం నుంచి ప్రేమిస్తున్నా, అ ప్రేమ బయటపెట్టలేక సతమతమయ్యేవాడ్ని. అలా పార్కుకు వెళదాం.

దొరికిన సమయాన్ని వృధా వేసుకోకుండా ఒకరి అభిప్రాయాన్ని మరొకరం తెలుసుకుందాం."

"హలో! శ్యామసుందర్! ఉదయం కాలేజీకి రాలేదేం?" విజయకుమార్ మాటలకు జవాబు చెప్పకుండా అడిగింది.

తల వంచుకుని నడిచి వస్తున్న ఆవ్యక్తి "తలనొప్పిగా ఉండి రాలేకపోయానండీ" అన్నాడు.

"అయ్యో! అలాగా! అలా కాంటీను వైపు వెళదాం పదండి కొంచెం కాఫీ తాగుదాం, విజయ్! నాకు పనుంది నేవస్తా" అంటూ శ్యామసుందర్, 'నాకేం పరవాలేదండి. ఇప్పుడు తగ్గిపోయింది' అంటున్నా వినకుండా అతన్ని కాంటిను వైపు లాక్కుపోయింది.

విజయకుమార్ వెళుతున్న కృష్ణవేణిని, శ్యామసుందర్‌ని కసిగా చూశాడు. నల్లగా, సన్నగా ఏ ఆకర్షణాలేని శ్యామసుందర్ అంటే ఎందుకు కృష్ణవేణి కింత అభిమానం. క్లాసులో ఎప్పుడు ఏ సందేహమొచ్చినా శ్యామసుందర్నే అడుగుతుంది. ఇంట్లో మని షిలా ప్రవర్తిస్తుంది.

కృష్ణవేణి వెన్నెలయితే, శ్యామసుందర్ చీకటికి సింబల్. కృష్ణవేణి జలపాతం అయితే, శ్యామసుందర్ బండరాయి. శ్యామ సుందర్ మంచి పాటగాడని పేరు. వాడిపాటలంటే తనకు ఒళ్ళు మంట. వాడి పాటలు వినాలని ఎంతోమంది ఆడపిల్లలు వాడి చుట్టూ మూగుతారు. కాని ఏం లాభం? వాళ్లతో అంటీముట్టనట్లు మాట్లాడుతాడు. అదే తనయితే వూరకుండేవాడా?

ఆలోచనలతో క్లాసు రూము చేరుకున్నాడు. స్నేహితుల బృందం ఇతన్ని ఓదార్చారు.

"విజయకుమార్! బాధ పడకురా! ఈసారి ఇంకొద్దిగా ముందుకు పో. ప్రేమ ఎప్పుడూ ఒక్కసారిగా సక్సెస్ కాదు."

"డోన్ట్ బి డిస్కరేజియస్ మైడియర్ విజ్జీ! ఆమె నిన్ను ప్రేమించలేదని చెప్పలేదు గదా. ఏదో స్నేహితుడని అలా కాఫీకి వెళ్లింది. అంతమాత్రానికి నువ్వింత ఉక్రోష పడితే ఎలా ?"

"ఒరేయ్! ఈసారి ఎక్కువటైమ్ తీసుకోనయినా నిదానంగా మాట్లాడు. ఒక్కసారి నీ వలలో పడిందంటే చాలు. కుక్కలా నీవెంట తిరుగుతుంది. చివరకు వదిలించుకోవడం నీకు సమస్య అవుతుంది."

స్నేహితుల సలహాలు విజయకుమార్‌లో మరలా ధైర్యం పుంజుకునేట్లు చేశాయి. ఈసారి సామ, దాన, భేధ, దండోపాయాలు ఏది ఉపయోగించయినా సరే ఆమెను తన వైపు తిప్పుకోవాలి అనుకున్నాడు.

మరుసటి రోజు క్లాసు కాగానే అందరూ ఇండ్లకు బయలుదేరారు.

విజయకుమార్ అమ్మాయిల గుంపు ననుసరించి "కృష్ణవేణీ! మాట" అని పిలిచాడు. అమ్మాయిలు విజయకుమార్‌ని, కృష్ణవేణిని మార్చి మార్చి చూశారు. కారణం విజయకుమార్ రాసలీలలు అందరికీ తెలిసి ఉండడమే

"ఏమిటి?" అంది కృష్ణవేణి అమ్మాయిల్ని వదిలి వెనక్కు వచ్చి.

"అలా పార్కుకు వెళదాం. నీతో కొన్ని విషయాలు మాట్లాడాలి."

"పార్కుకు ఎందుకు విజయ్! ఏవైన విషయాలుంటే చెప్పు ఇక్కడే."

"ఇక్కడ చెప్పేవి కాదు."

"సరే. ఈసారెప్పుడైనా చూద్దాంలే"

"నువ్వేదో ధైర్యస్థురాలవనుకున్నాను కృష్ణవేణి! ఇంత భయమా నీకు?"

''భయం దేనికి, వెళదాంపద."

ఇద్దరూ కాలేజి పార్కులోకి నడిచారు. దూరంగా చెట్లకి నీళ్ళు పెడుతున్నాడు తోటమాలి. మెత్తని పచ్చికమీద కూర్చున్నారు ఇద్దరూ.

"ఇప్పుడు చెప్పు ఏమిటో?"

విజయకుమార్ గడ్డి పరకలు తుంచి విసిరి వేస్తూ నెమ్మదిగా అన్నాడు.

"కృష్ణవేణీ! నేను నిన్ను ప్రేమిస్తున్నాను. ఆ విషయం చెప్పడానికే నిన్ను రమ్మన్నది."

"సారీ విజయకుమార్! ఈ విషయంలో కాదన్నందుకు మన్నించు."లేచి నిలబడింది.

"కృష్ణవేణీ! ప్లీజ్ నాప్రేమను తిరస్కరించకు" దీనంగా అడిగాడు విజయకుమార్ తనూ లేస్తూ.

"మిస్టర్ విజయకుమార్! ప్రేమమీద నాకు కొన్ని ప్రిన్సిపుల్స్ ఉన్నాయి. నాకాబోయే భర్తకు ఉండవలసిన లక్షణాలు ముందే నిర్ణయించుకున్నాను."

"అయితే నాకు అలాంటి లక్షణాలు లేవని నీ అభిప్రాయమా"?

"నేను అలా అనలేను. ప్రస్తుతానికి నన్ను వదిలెయ్" అంటూ వెనుదిరిగింది కృష్ణవేణి.

''మైడియర్ కృష్ణవేణీ! ఐ కాంట్ లివ్ వితౌట్ యూ. ప్లీజ్! ప్రేమించానని చెప్పు."

"ఆయామ్ సో సారీ!" విసవిసా నడిచింది కృష్ణవేణి.

"కృష్ణవేణీ! నువ్వు కాదంటే నేను చచ్చిపోతాను" అంటూ ఆమెకు ఎదురు నిలబడి అమాంతం కౌగిలించుకుని ముద్దు పెట్టుకున్నాడు. కృష్ణవేణి ఈడ్చి కొట్టింది.

కండక్టరు అరుపులకు వూహల్లోంచి ఈలోకంలోకి వచ్చాడు విజయకుమార్ చెంప తడుముకుంటూ. తమ దిగవలసిన స్టేజి ఇది

"విజయ్! సీటుందిగా కూర్చో. నిలబడ్డావేం?" అంది కృష్ణ వేణి. విజయకుమార్ సిగ్గుపడ్డాడు. సీట్లు చాలా ఖాళీ ఉన్నాయి. అయినా తను హాంగరు పట్టుకుని నిలబడే ఉన్నాడు. విజయ కుమార్ ఒక సీట్లో కూర్చున్నాడు. అక్కడ నుంచి కృష్ణవేణి చెప్పిన స్టేజి వరకు టికెట్ కొట్టించాడు.

బస్సు బయలుదేరింది. దాంతోపాటు అతని వూహలు మళ్ళీ మొదలయ్యాయి.

కృష్ణవేణి తనను చెంపదెబ్బకొట్టి అవమానించిన తరువాత ఆమెను ఏమిచేయడానికైనా వెనకాడలేదు విజయకుమార్. ఆమెను నాశనం చేయడానికి ఎన్నో ప్రయత్నాలు చేశాడు. చివరకు ఏదీ ఫలించలేదు అఖరుకు నిజంగానే కృష్ణవేణిని పెళ్లాడాలని పెద్ద మనుషులద్వారాకూడా సంప్రదింపులు చేశాడు. కృష్ణవేణి నసే మిరా చేసుకోనంది. దాంతో నిరాశపడిపోయాడు విజయకుమార్

ఇది విజయకుమార్ జీవితంలో ఒక షాకయితే ఇంకో భయంకరమైన సంఘటన జరిగింది మవున యోగిలా ఉండే అనా కారి శ్యామసుందర్ని కృష్ణవేణి ఫైనలియర్లో రిజిస్టరుమారేజి చేసు కోవడం. ఇంత అందమైనతను ఉంటే తనను కాదని గాలికి ఎగిరే అకులాంటి శ్యామసుందర్ని ఎందుకు చేసుకుందో అతనికి అర్థం కాలేదు. తనకు చేసిన అన్యాయానికి తగిన శిక్ష అనుభవిస్తుందిలే అనుకున్నాడు. అమె చూసేట్లుగా ఆ సంవత్సరాంతం వరకు ఆమె ముందే ఎంతో ఖర్చుపెట్టి ఎంతోమంది ఆడవాళ్ళతో స్నేహం చేశాడు.

అఖరుకు ఒకసారి ఉండబట్టలేక కృష్ణవేణిని అడిగేశాడు.

"వాడ్ని ఏంచూసి చేసుకున్నావు కృష్ణవేణీ? డబ్బా! అందమా! ఏమీలేనివాడ్ని చేసుకుని ఎలా బతుకుతావు?"

"విజయ్! ఈ ప్రశ్నకు ప్రస్తుతం నేను జవాబు చెప్పలేను. కాలం జరగనీ. కాలంతోపాటు జీవితమే ఈ ప్రశ్నలకు జవాబు చెబుతుంది" అని తప్పించుకుంది.

తరువాత కాలేజి చదువు పూర్తికావడంతో ఎవరి జీవితాలు వారివయ్యాయి. విజయకుమార్ జీవితంలో ఈ సంఘటన కొంత కాలం మాత్రమే గుర్తున్నది. ఇప్పుడు ఇలా కలుసుకోవడంవల్ల కోర్కెలు తిరిగి తలెత్తాయి. ప్రస్తుతం కృష్ణవేణి ఖచ్చితంగా తన అనాకారి భర్తను వదిలేసి ఉంటుంది. తన అదృష్టం బాగుంటే ఇక తనను సుఖపెడుతుంది అనుకున్నాడు.

ఇంతలో తాము దిగవలసిన స్టేజి వచ్చేసరికి కృష్ణవేణిలేచి నిలబడింది. ఆమె వెనకనే విజయకుమార్‌కూడా దిగాడు. కృష్ణవేణి కొద్దిదూరం నడిచి ఒక సందులోకి మలుపు తిరిగింది.

"కృష్ణవేణీ! సుఖంగా ఉన్నావా?" ఆత్రతనణుచుకుంటూ అడిగాడు విజయకుమార్.

"ఈ మానవ జన్మకు ఎప్పుడూ సుఖమంటూ ఉండదు, విజయ్! కోరికలు అనంతాలు. ఏ దశలోనూ మానవుడికి తృప్తి ఉండదు. ఒకటి దొరికినప్పుడు ఇంకోదానికోసం వెంపర్లాడుతుంటాడు."

'మెట్ట వేదాంతం చెబుతోంది కాబట్టి ఈ మనిషి సంసారం నాశనమయినట్లే! తనకు కావలసిందికూడా అదే! ఎలాగయినా తనను ఆమె హృదయంలోకి ఆహ్వానిస్తే చాలు' అనుకున్నాడు విజయకుమార్.

"నీ విషయ మేమిటి, విజయ్! ఏం ఉద్యోగం చేస్తున్నావు, భార్య ఎలా ఉంటుంది. పిల్లలెంతమంది"

విజయకుమార్ తన సంగతి చెప్పుకున్నాడు.

"అయితే ముత్యాల్లాంటి ఇద్దరు పిల్లలు. అందమయిన భార్య. మంచి ఉద్యోగం నువ్వు ఎప్పటికీ అదృష్ట జాతకుడివే. విజయ్!"

"నీలోనూ ఏమీ మార్పులేదు కృష్ణవేణీ! అప్పటికంటే బాగున్నావు."

"నీవుకూడా అంతే, విజయ్! అవే చిలిపిమాటలు అదే హుషారు. నాకెంతో ఆనందంగా ఉంది"

"నిజంగానా, కృష్ణవేణీ"

"నిజం, విజయ్. మనం నాలుగేళ్ళనుంచి ఈ మహానగరంలో ఉంటూకూడా ఒకరినొకరం కలుసుకోకపోవటం దురదృష్టం. ఇలా యాదృచ్ఛికంగా కలుసుకోవడం మన అదృష్టం."

తరువాత కృష్ణవేణి కాలేజికబుర్లలోకి దిగింది. సంతోషంగా ఆనాటి సంఘటన లెన్నో వల్లెవేసుకుంది. తమ క్లాసుమేట్సు ఎక్కడెక్కడ ఏమేం చేస్తున్నారో తనకు తెలిసినంతవరకు చెప్పింది. తరువాత విజయకుమార్ తనకు తెలిసిన వాళ్ళ విషయాలు చెప్పాడు. నవ్వుకుంటూ కబుర్లు చెప్పుకుంటూ నడిచారు.

''ఇదే మాఇల్లు" అంది కృష్ణవేణి ఒక ఇంటి ముందు ఆగి.

అది రెండంతస్తుల భవనం. పైన రెండు పోర్షన్లు, కింద రెండు పోర్షన్లు ఉన్నాయి. కింద భాగంలోని ఒక పోర్షనులో ఉంటోంది కృష్ణవేణి.

కాలింగ్‌బెల్ నొక్కగానే ఒక ముసలావిడ వచ్చి తలుపు తీసింది.

"ఈవిడ మా అత్తగారు'' అంటూ పరిచయం చేసింది.

ముసలావిడ వెనుకనే "అమ్మా" అంటూ వచ్చి కృష్ణవేణి కాళ్ళు పట్టుకున్నాడు అయిదేళ్ళవాడు.

"వీడు మా జ్యేష్ఠ పుత్రుడు. నాకు వీడంటే ఎంతో ఇష్టం. వాడికి నే నంటే ఇంకా ఇష్టం" అంటూ వాడ్ని పైకెత్తి పట్టుకుంది.

విజయకుమార్ వాడివైపు చూశాడు. వాడునల్లగా, సన్నగా ఎలుకలా ఉన్నాడు. వీడు కృష్ణవేణి కడుపున ఎలా పుట్టాడో అనుకున్నాడు. కృష్ణవేణికి అనాకారులంటే ఎంతో ఇష్టంలాగుంది. తను అనాకరిగాపుట్టినా బాగుండేది అనుకున్నాడు విజయకుమార్.

"కృష్ణవేణీ! ఇంకా శ్యామసుందర్‌తో కాపురంచేస్తున్నావా?" ఆమె చూపిన కుర్చీలో కూర్చుంటూ ఉండబట్టలేక అడిగాడు.

ఆమె ముఖం వెలవెలా పోయింది.

"అంటే"? అని మాత్రమే అనగలిగింది.

విజయకుమార్ తల వంచుకున్నాడు.

"చూడు, విజయ్! నీవు ఏమాత్రం మారలేదు. శ్యామసుందర్ అనాకారివాడనీ, అందవిహీనుడని నేనేదో త్వరపడి చేసుకున్నానని, తరువాత వదిలేసి ఉంటానని అనుకున్నావు కదూ! నీ అంచనాలు తప్పు. ఆడది ఎప్పుడూ ఒకరినే ప్రేమిస్తుంది. ఒకరికే మనసిస్తుంది. అందగాడు, డబ్బున్నవాడు కనబడితే మొగుడ్ని వదిలేసి అతనివెంట పడదు. అలా వెంటబడేదయితే స్త్రీ తన జీవితకాలంలో ఎంతమంది భర్తల్ని మార్చాలి?" ఆవేశంగా ప్రశ్నించింది.

ఇంతలో శ్యామసుందర్ వచ్చాడు. రాగానే విజయకుమార్ వైపు ఆశ్చర్యంగా చూశాడు.

"మీరు విజయకుమార్‌గారు కదూ" అన్నాడు తడబడుతూ.

"మీరు. గారూ అంటా వేమిటి, శ్యాం, అతను మన క్లాస్‌మేటు విజయ్."

శ్యామసుందర్ విజయకుమార్ కి షేక్‌హాండిచ్చి, "విజయ్! ఎంతకాలానికి మనం కలుసుకున్నాం. ఇది నిజంగా మాఅదృష్టం" అన్నాడు.

విజయకుమార్ తన మృదువైన చేతిలో గట్టిగా కొయ్యలా ఉన్న శ్యామసుందర్ చేతిని అంటీ ముట్టనట్లు పట్టుకుని వదిలేశాడు. శ్యామసుందర్ మునుపటికన్నా సన్నగా ఉన్నాడు కళ్ళకు అద్దాలు వచ్చాయి.

"కృష్ణవేణి! బాబిగాడేడి?"

"ఎక్కడికైనా బయటికెళ్ళాడేమో!"

"నాతో తగాదా పెట్టుకుని అలిగి మావయ్య వాళ్ళింటికి వెళ్ళాడు, నాన్నా! నువ్వు బతిమాలించి తీసుకువస్తేనేకాని రాడట" పెద్దవాడు విషయం చెప్పాడు.

"అరె.... తీసుకొస్తానుండు" అంటూ అవతలి పోర్షను వైపు వెళ్ళాడు.

"అదీ విజయ్, విషయం, పెద్దవాడంతా వాళ్ళ నాన్న పోలిక. వాడంటే నాకెంతో ఇష్టం. చిన్నవాడు అచ్చం నా పోలిక. వాడ్ని వాళ్లనాన్న ఒక్కక్షణం వదిలిపెట్టడు. అనుబంధం అంటే అలా ఉంటుంది, విజయ్. నీకూ ఇద్దరు పిల్లలు ఉన్నారు కనక నేను చెప్పనవసరం లేదనుకుంటాను" అంది కృష్ణవేణి.

ఇంతలో శ్యామసుందర్ బాబిగాడ్ని తీసుకువచ్చాడు వాడు అచ్చం కృష్ణవేణిలా ఉన్నాడు. తెల్లగా, అందంగా, బొద్దుగా ఉన్న వాణ్ణి ఎత్తుకోకుండా ఉండలేక పోయాడు. విజయకుమార్‌ని, అతని ఒడిలో ఉన్న బాబిగాడ్ని దంపతులిద్దరూ తృప్తిగా చూశారు. బాబుమాత్రం విజయకుమార్ వైపు ఉరిమి చూశాడు, తనను అసలు పలకరించనుకూడా పలకరించనందుకు.

"ఇంతకూ విజయ్‌కు టిఫిన్‌పెట్టావా" అన్నాడు శ్యామ సుందర్ హఠాత్తుగా,

"టిఫిన్ ఏమిటి....ఏకంగా భోజనం తయారుచేస్తున్నాను"

''భోజనం చేయకుండా ఎలా వెళతాడు. ఈలోగా టిఫిన్ పెడితే బాగుంటుందని."

"ఫరవాలేదు, శ్యాం! నేను అర్జంటుగా వెళ్ళాలి. టిఫిన్‌లు, భోజనాలు పెట్టుకోకండి."

"అదేం కుదరవు, విజయ్! భోజనం చేయందే ఇక్కడ నుంచి కదలడానికి వీల్లేదు. శ్యాం! నువ్వుమార్కెట్‌కివెళ్ళి ఈఅయిటమ్స్ అర్జంటుగా తేవాలి" అంటూ కాగితంమీద ఏవో వ్రాసి ఇచ్చింది.

శ్యామసుందర్ సంచితీసుకుని, సైకిలుమీదవెళ్ళిపోయాడు.

అత్తగారికి సాయంచేయడానికి కృష్ణవేణి వంట రూములోకి వెళ్ళింది.

విజయకుమార్‌కు ఇక అక్కడ ఉండబుద్ధి కాలేదు. కృష్ణవేణి భర్తను వదిలేసి ఒంటరిగా ఉంటే తమ పూర్వ పరిచయాన్ని పురస్కరించుకుని జారిపోయిన క్షణాల్ని జాగ్రత్తచేసుకుందామనుకున్నాడు. కానీ, జరిగిందేమిటి? కృష్ణవేణి భర్త, పిల్లలతో సంతోషంగా ఉంది. ఒళ్ళోని పిల్లవాడ్నికిందికిదింపి లేచి నిలుచున్నాడు.

కృష్ణవేణిని పిలిచాడు.

'"ఏమిటి విజయ్" అంటూ వచ్చింది కృష్ణవేణి.

"ఇక నేను వెళతాను, కృష్ణవేణీ!"

''అదేమిటి, విజయ్! శ్యాంని ఇప్పుడేకదా ఫ్రూట్స్ తెమ్మని పంపాను. భోజనం చేయకుండా ఎలా వెళతావు?"

"సారీ....తలనొప్పిగా ఉంది."

"అరె అలాగా! టాబ్లెట్ తెస్తానుండు. ఇంట్లో ఉండాలి." హడావుడిగా లోపలికి వెళ్ళబోయింది

''ఆగు, కృష్ణవేణి! అది టాబ్లెట్‌తో తగ్గేదికాదు."

"అంటే"

"అవును, కృష్ణవేణి! నీవులేని నా జీవితం శూన్యం అనిపిస్తూ ఉంది!" ఏమయితే అదయిందని కడుపులోని బాధ బయట పెట్టాడు.

కృష్ణవేణి ఒక క్షణం దిగులుపడిపోయింది. తరువాత లేని హుషారు తెచ్చుకుంటూ- "విజయ్! ఏ కారణంచేత నిన్ను పెళ్ళి చేసుకోలేకపోయానో చెబుతాను విను" అంది.

విజయకుమార్ ఏం చెబుతుందో విందామని కూర్చున్నాడు.

''విజయ్! నేను నిన్ను చెంపదెబ్బకొట్టి అవమానించిన తరువాతకూడా నీవు నావెంట బడడం చూసి నీనిష్కల్మష ప్రేమకు జోహారులర్పించాను, నిన్నే చేసుకోవాలనుకున్నాను. కాని, సెకండియర్ బి. ఎ లో యానివర్సిరీ రోజు జరిగిన సంఘటనవల్లఅంతా తారుమారయింది."

విజయకుమార్ ఆశ్చర్యపోయాడు. కృష్ణవేణి తననునిజంగా వివాహమాడాలనుకుందా? అయితే జరిగిందేమిటి?

"ఏమిటా సంఘటన?'' ఆత్రతగా అడిగాడు.

''యానివర్సరీ రోజు విద్యార్థినీ, విద్యార్థులతో కాలేజి నిండుగా ఉంది. అరాత్రి అడిటోరియంలో విచిత్ర వేషధారణలు, నాటికలు జరుగుతున్నాయి. పక్కనేఉన్న గార్డెనులో లైట్లు దేదీప్యమానంగా వెలుగుతున్నాయి. కొంతమంది విద్యార్థులుకూడా అటూ ఇటూ సందడిగా తిరుగుతున్నారు. నేను అలా గార్డెనులోకి వెళ్ళాను. అక్కడే జరిగింది పొరపాటు. ఎవడో ఒకవిద్యార్థి పొంచి

ఉండి గార్డెనుకు కరెంటు సప్లైచేసే వైర్లు కట్‌చేశాడు. గార్డెనంతా చీకటిమయమైపోయింది. తరువాత నన్నెవరో అరవకుండా నోరు మూసితీసుకునిపోయారు. తరువాత శీలం కోల్పోయాను. ఒకరి తరువాత ఒకరుగా నలుగురు నాశీలాన్ని అపహరించి ఎటో వెళ్ళి పోయారు. కొంతసేపటికి తేరుకున్న నేను నిలబడి చుట్టూచూశాను నేను గార్డెనుకు ఒక ఫర్లాంగు దూరంలో ఒక పాడుబడ్డ ఇంట్లో ఉన్నాను.

నాకు జరిగిన అన్యాయానికి ఎంతోకాలం రోదించాను. శీలం పోగొట్టుకున్న నేను నీకు భార్యగా అర్హురాలిని కాను. అదే సమయంలో శ్యామసుందర్‌కు సీక్రెట్‌గా విషయం చెప్పి నన్ను వివాహం చేసుకోమన్నాను. శ్యామసుందర్ నామాట కాదనలేక రిజిష్టర్ మారేజి చేసుకొన్నాడు. ఇప్పుడు చెప్పు నేను నీకు అన్యాయం చేశానా?"

విజయకుమార్‌కు తల తిరిగిపోయింది. ఎంతపని జరిగింది. ఒక అపవిత్రురాల్ని తాను దైవంగా ప్రేమించాడు. ఆమె పెళ్ళి చేసుకోక పోయేసరికి పిచ్చివాడయిపోయాడు. అమె జీవిత భాగ స్వామిగాలేని తన జీవితం వ్యర్థమనుకున్నాడు. దేవుడు దయామయుడు. కాకపోతే తనను ఇంత ఘోరం నుంచి తప్పిస్తాడా ? ఆ శ్యాంసుందర్‌గాడొక యూసలెస్‌ఫెలో కాబట్టి కృష్ణవేణిని చేసుకున్నాడు ఎంద అందమున్నా శీలం పోగొట్టుకున్న ఆడదీ ఒక ఆడదెనా?

విజయకుమార్ అడుగులు ముందుకు వేశాడు. కృష్ణవేణి ఎంత బతిమాలినా వినిపించుకోలేదు. వెనక్కు తిరిగి చూడకుండా నడిచి వెళ్ళాడు. అతన్ని బతిమాలుతూ గుమ్మం వరకు వచ్చిన కృష్ణవేణి కారేకన్నీటితో అలాగే నిలబడిపోయింది.

"విజయ్! ఎందుకలా వెళ్ళిపోతావు. శ్యామసుందర్‌ను నేను చేసుకున్నాననే బాధ నీలో సుళ్ళు తిరుగుతుందని, ఆ భాధ పోగొట్టడానికి నన్ను నేను వంచనచేసుకుని, పవిత్రంగా భావించే నాశీలాన్నికూడా పోగొట్టుకున్నానని నీకోకల్పితకథ చెప్పాను. దేనికి? సృష్టిలోతీయనైన, అతిపవిత్రమైన స్నేహంకోసం. స్నేహితులంటే ప్రాణంవిడిచే నన్ను అర్థంచేసుకుని నీ స్నేహామృతాన్ని పంచివ్వలేకపోయావు.

నీ మనసులోని చీకటి తెరల్లోకి కాంతి ఇంకా రాలేదు విజయ్! ఇక ఎప్పటికీ రాదేమో, కాని నీవనుకున్నట్లు శ్యాంసుందర్ చూడడానికి అనాకారో, అందవిహీనుడు కావచ్చేమో కాని అతని మనసు అందమైనది, విజయ్! నీళ్ళకంటె స్వచ్ఛమైనది. గాలి కంటే పలుచనైనది. నన్ను అర్థంచేసుకున్నవాడు. నాఆలోచనలకు, ఆశయాలకు వూపిరిపోసేవాడు. అది నీకు అర్థంకాదు, విజయ్! అందుకే గుండె లోపలి పొరల్లోకి చూడలేని నీకు అతను అనాకారిగా కనిపిస్తాడు. ఇప్పుడు నీవు వెళ్ళిపోయావని తెలిసి శ్యాం గుండె తపనతో ఎలా కొట్టుకుంటుందో!'' నిలబడేశక్తి లేనట్లుగా ఆమె గుమ్మంలో కూలబడిపోయింది.

★